సాక్షి సంగారెడ్డి

గురువారం । 5 । జనవరి । 2023



పంట వ్యర్థాలతో బయోచార్

పంట వ్యర్థాలతో బయోచార్‌ను తయారు చేసి, సేంద్రియ వ్యవసాయం దిశగా రైతులు అడుగులు వేసేలా అవగాహన కల్పిస్తున్నారు. 8లో



పోలీసులకు ఆరోగ్య రక్ష 8లో

కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్యులచే ఉచిత ఆరోగ్య సూచనలు, సలహాలు, చికిత్సపై అవగాహన సదస్సు నిర్వహించారు.



ఉత్సవాలకు వేళాయే..

మినీ మేడారం మొగుడంపల్లి మరిగమ్మ మోతి మాత జాతర ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. పెద్ద ఎత్తున ఉత్సవాలు జరగనున్నాయి. 9లో

సీన్ రివర్స్!

సంగారెడ్డికి కర్ణాటక చెరకు

- జిల్లా షుగర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్న బ్రోకర్లు
- బినామీల పేర్లతో విక్రయం
- స్థానిక రైతుల చెరకు క్రషింగ్‌కు ఇబ్బందులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఏటా చెరకు క్రషింగ్ సీజన్‌లో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతంలో సాగైన చెరకు కర్ణాటక, మహా రాష్ట్రల్లోని సమీప జిల్లాల్లో ఉన్న చక్కెర ఫ్యాక్టరీలకు తరలిపోతుంటుంది. కానీ ఇప్పుడు ఈ సీన్ రివర్స్ అయింది. కర్ణాటకలో పండిన చెరకు మన రాష్ట్రానికి రవాణా అవుతోంది. బీదర్, కలబుర్గి జిల్లాల్లో పండిన చెరకు సంగారెడ్డి, జహీరాబాద్ పట్టణాల సమీపంలో ఉన్న చక్కెర ఫ్యాక్టరీలకు వస్తోంది.

- జిల్లాలో రెండు చక్కెర కర్మాగారాలున్నాయి. సంగారెడ్డితో పాటు, మెదక్, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన కొంత విస్తీర్ణం ఫ్యాక్టరీల కోర్ ఏరియా పరిధిలో ఉంది. గత ఏడాది(2021–22) చెరకు క్రషింగ్ సీజన్‌లో సుమారు 10,765 ఎకరాల్లో చెరకు సాగు కాగా.. మొత్తం 5.94 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ జరిగినట్లు కేన్ కమిషనరేట్ గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది క్రషింగ్ సీజన్ ఇటీవలే ప్రారంభమైంది. ఈ సీజన్ మొత్తానికి తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులు క్రషింగ్ జరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచానా వేస్తున్నారు.

బ్రోకర్ల దందా..

- కొందరు బ్రోకర్లు కర్ణాటక ప్రాంతం రైతుల వద్దకు వెళ్లి గంపగుత్తగా చెరకు కొనుగోలు చేస్తున్నారు. టన్నుకు రూ.1,500 నుంచి రూ.రెండు వేల వరకు కొని జిల్లా పరిధిలోని షుగర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. ఈ బ్రోకర్ల చేతుల్లోనే చెరకు కోసే కూలీల ముఠాలు ఉంటాయి. రైతులతో రేటు మాట్లాడుకొని ఇక్కడి ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. భారీ వాహనాల్లో ఇక్కడికి రవాణా చేస్తున్నారు. ఒక్కో వాహనంలో 30 టన్నుల వరకు తరలిస్తున్నారు. జిల్లాకు చెందిన బినామీ రైతుల పేరుతో ఈ చెరకును తెచ్చి విక్రయిస్తున్నారు. ఈ రెండు ఫ్యాక్టరీల్లో చెరకుకు చెల్లించే రేటు కూడా కాస్త ఎక్కువగా ఉండటంతో ఈ బ్రోకర్లకు గిట్టుబాటు అవుతోంది.



లారీలో రవాణా అవుతున్న చెరకు

స్థానిక రైతులకు ఇక్కట్లు

- కర్ణాటక ప్రాంతం నుంచి వస్తున్న చెరకుతో స్థానిక రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫ్యాక్టరీలో తమ చెరకు వాహనాల అన్‌లోడింగ్‌కు జాప్యం జరుగుతోందని వాపోతున్నారు. చెరకు అన్‌లోడింగ్ కోసం రెండు రోజుల వరకు వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 18 గంటల లోపు అన్‌లోడ్ అయితే వెంట వెంటనే మరో లోడ్ తీసుకువచ్చేందుకు వీలవుతుందని, లేనిపక్షంలో కోసిన చెరకు ఎండిపోయి దిగుబడి తగ్గిపోతుందని రైతులు చెబుతున్నారు.

ఇక్కడి రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలి



కొందరు బ్రోకర్లు కర్ణాటక ప్రాంతం నుంచి చెరకును సంగారెడ్డి జిల్లాకు తరలిస్తున్నారు. దీంతో జిల్లాకు చెందిన రైతుల చెరకు ట్రాక్టర్లు, లారీల అన్‌లోడ్ చేయడంలో జాప్యం జరుగుతోంది. ఫ్యాక్టరీల అన్‌లోడింగ్‌లో ఇక్కడి రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

– నర్సింహారెడ్డి, భారతీయ కిసాన్‌సంఘ్ నాయకుడు

సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ సీపీఐ



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్: సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ సీపీఐ ఉంటుందని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సమస్యలు పరిష్కరించడమే సీపీఐ లక్ష్యమన్నారు. హుస్నాబాద్‌లోని అనబేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల గైడ్‌లైన్స్ రాగానే, రాష్ట్ర పార్టీ పొత్తుల నిర్ణయం తీసుకుంటుందన్నారు. పక్కా ఇళ్ల పథకం కింద అర్హులైన వారి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవసరమైతే హడ్కో నుంచి రుణం తీసుకొని సొంత స్థలం ఉన్నవారికి ఇవ్వాలన్నారు. రెవెన్యూ కొత్త చట్టం వచ్చిన తర్వాత భూ సమస్యలు ఎక్కువయ్యాయని అన్నారు. ధరణి పోర్టల్‌లో చాలా లొసుగులు ఉన్నాయని ఒక్కసారి ధరణిలో భూమిని చేర్చితే తీసేసే వీలులేకుండా ఉందన్నారు. సాదాబైనామాలను మీ సేవలో పెట్టుకునే అవకాశం లేదన్నారు. రెవెన్యూ చట్టాలను సవరించాలన్నారు. సర్వే నంబర్ ఆధారంగా భూముల సమగ్ర సర్వే చేయాలని డిమాండ్ చేశాడు. న్యాయవాదుల సంకల్పం, ప్రయత్నం, పోరాడటం వల్లనే హుస్నాబాద్‌కు సబ్‌కోర్టు మంజూరైందని, దీనికి తమ చేదోడు వాదోడు ఉందన్నారు. చిట్‌ఫండ్ బాధితుల బాధలు వర్ణాతీతమని, చిట్టీలు ఎత్తుకున్నవారికి డబ్బులు ఇవ్వకుండా బోర్డులను తిప్పివేస్తున్నారన్నారు. సిద్దిపేటలో ఇటీవల భవిత చిట్ ఫండ్‌పై దాడి జరిగిందన్నారు. తమకు డబ్బులు ఇప్పించాలని బాధితులు పోలీస్ స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేసిన వారికి న్యాయం జరుగడం లేదన్నారు. చిట్‌ఫండ్ బాధితుల పక్షాన ఈ నెల 20వ తేదీలోపు సిద్దిపేట, హుస్నాబాద్‌లో సదస్సు నిర్వహిస్తామని చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, కరీంనగర్ జిల్లా సహాయక కార్యదర్శి కోయ్యడ సృజన్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, నాయకులు వనేశ్, కొమ్ముల భాస్కర్, సంజీవరెడ్డి, మల్లారెడ్డి, సంపత్,గూడెం లక్ష్మి, కుమారస్వామి, కుమార్ తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

పక్కాగా పంటల వివరాల నమోదు

జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు



నాటును పరిశీలిస్తున్న నర్సింహారావు

జోగిపేట(అందోల్): యాసంగి పంటల నమోదు ప్రక్రియను పక్కాగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు సూచించారు. బుధవారం మండల పరిధిలోని కిచ్చన్నపల్లి గ్రామంలో వరి నాటు విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగిలో వరికి వచ్చే తెగుళ్లను నివారించేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పరిమితికి మించి రసాయన ఎరువులను వేయకూడదన్నారు. యాసంగిలో ప్రతి రైతు పంటల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. పంటల నమోదులో అలసత్వం వహించరాదన్నారు. పంట ఉత్పత్తులను విక్రయించడం, ప్రభుత్వ పథకాల అమలుకు రైతుల వివరాల నమోదు తప్పనిసరి అన్నారు. ఏఓ విజయరత్న, ఏఈఓలు శ్రీనివాస్, శ్రీకర్, అనిత తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్ శివశంకర్‌కు ఉత్తమ అవార్డు



సజ్జనార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శివశంకర్

జోగిపేట(అందోల్): సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జోగిపేట పట్టణానికి చెందిన ఉస శివశంకర్‌కు ఉత్తమ అవార్డు దక్కింది. బుధవారం హైదరాబాద్‌లోని కళామందిర్‌లో నిర్వహించిన ఎక్స్‌ట్రా మైల్ అవార్డుల ప్రదానోత్సవలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కండక్టర్ శివశంకర్‌కు ఉత్తమ అవార్డును అందించి అభినందించారు. కండక్టర్ శివశంకర్ విధి నిర్వహణలో భాగంగా గత నెల డిసెంబర్ 7వ తేదీన శ్రీశైలం నుంచి సంగారెడ్డికి వస్తున్న ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికురాలు డిండి ప్రాంతంలో తన బ్యాగు మర్చిపోయి బస్సు దిగిపోయింది. డ్యూటీలో ఉన్న కండక్టర్ శివశంకర్ ప్రయాణికురాలి బ్యాగును సీటుపై గుర్తించి, అందులో ఉన్న ఆధారాలతో ఫోన్ నంబర్ కనుక్కొని ప్రయాణికురాలికి సమాచారం ఇచ్చి బ్యాగును అందజేశాడు. బ్యాగులో బంగారం, విలువైన వస్తువులు భద్రంగా ఉండటంతో కండక్టర్‌కు ప్రయాణికురాలు కృతజ్ఞతలు తెలిపింది. బ్యాగును భద్రంగా ప్రయాణికురాలికి అందించిన శివశంకర్ గొప్పతనాన్ని గుర్తించి ఈ అవార్డును డీఎం సజ్జనార్ అందజేశారు. శివశంకర్‌ను డిపో మేనేజర్‌తో పాటు తోటి కండక్టర్లు అభినందించారు.

రహదారులతోనే గ్రామాల అభివృద్ధి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



రోడ్డు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: రహదారుల అభివృద్ధితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. నారాయణఖేడ్ పట్టణ శివారులోని పంచగామ కమాన్ వద్ద పంచగామ క్రాస్‌రోడ్డు నుంచి పంచగామ, రాణాపూర్, తుమ్నూర్ మీదుగా ముగ్దుంపూర్ వరకు రూ.4.25కోట్లతో బీటీ రెన్యూవల్ పనులకు బుధవారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, వైస్ చైర్మన్ పరశురాం, కౌన్సిలర్లు మాజీద్, నర్సింహులు, నాయకులు రమేశ్ చౌహాన్, రవీందర్ నాయక్, అభిషేక్ షెట్కార్, ముజామ్మిల్, సత్యం సేట్, నవాబ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 16మందికి కల్యాణలక్ష్మి, తొమ్మిది మందికి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. అలాగే పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా శాఖ ముద్రించిన 2023 కేలండర్‌ను ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జెట్ల భాస్కర్, ఇతర బాధ్యులతో కలిసి ఆవిష్కరించారు.

త్వరగా భూ సమీకరణ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి భూ సమీకరణను ఈ నెల 10లోగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ ఆర్డీఓలు, తహసీల్దార్లకు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, రాజర్షితో కలిసి రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లతో భూ సమీకరణ, హై వాల్యూ కాలనీస్, స్ట్రేబిట్స్, జీఓ 59 దరఖాస్తులు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమీకరణపై తహసీల్దార్లు శ్రద్ధ చూపాలన్నారు. ఎలాంటి సమస్యలు లేకుండా భూ సమీకరణను పూర్తి చేయాలన్నారు. ఆయా మండలాల తహసీల్దార్లు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. జీఓ 59 కింద వచ్చిన దరఖాస్తుల సమగ్ర నివేదికను అందించాలన్నారు. ఈ సమావేశంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి నగేశ్, అంబదాస్, కలెక్టరేట్ ఏఓ మహిపాల్ రెడ్డి, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

రెవెన్యూ శాఖ అధికారులు ప్రజలకు చేరువై మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ శరత్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీస్ సంగారెడ్డి జిల్లా క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు, సిబ్బంది ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. అందరి సమన్వయంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుండేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారులు నగేశ్, అంబదాస్, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాములు, కార్యదర్శి మహిపాల్ రెడ్డి, అన్ని డివిజన్ల అధ్యక్ష కార్యదర్శులు, తహసీల్దారులు పాల్గొన్నారు.

హెల్త్ ప్రొవైడర్ల నియామకానికి నోటిఫికేషన్



సంగారెడ్డి టౌన్: జిల్లాలోని పల్లె దవాఖానాల్లో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ల నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఒక సంవత్సర కాలానికి నియామకం చేయనున్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు సంబంధించిన గైడ్‌లైన్స్, దరఖాస్తులు కలెక్టర్ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. మెరిట్ లిస్టను జనవరి 10న కలెక్టర్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. లిస్టుకు సంబంధించి అభ్యంతరాలను జనవరి 11న స్వీకరిస్తామని, 12న ఫైనల్ మెరిట్ లిస్టను ప్రదర్శిస్తామని తెలిపారు. జనవరి 13న ఎంపికైన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి నియామక ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం



సంగారెడ్డి టౌన్: నిరుద్యోగులకు ఎంప్లాయిమెంట్ కార్డు ఎంతో ఉపయోగపడుతుందని ఉపాధి కల్పన అధికారి వందన ఒక ప్రకటనలో తెలిపారు. ఎంప్లాయిమెంట్ కార్డు జారీకి జిల్లా ఉపాధి కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి సర్టిఫికెట్లతో సంగారెడ్డిలోని బైపాస్ ఉపాధి కల్పన కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకే తొలిమెట్టు



ఎగ్జిబిట్స్‌ను డీఈఓ రాజేశ్‌కు వివరిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లా విద్యాధికారి రాజేశ్

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేందుకు ఉపాధ్యాయులు టీఎల్ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) ఉపయోగించి బోధించాలని ఉపాధ్యాయులకు జిల్లా విద్యాధికారి రాజేశ్ సూచించారు. బుధవారం పటాన్‌చెరు పట్టణంలోని జీహెచ్ఎంసీ ఫంక్షన్ హాలులో పటాన్‌చెరు, అమీన్‌పూర్ రెండు మండలాలకు సంబంధించి టీఎల్ఎం మేళాను ఎంఈఓ రాథోడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఈఓ రాజేశ్, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, ఎంపీపీ సుష్మశ్రీ, జెడ్పీటీసీ సుప్రజ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ రాజేశ్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని మండలాల్లో టీఎల్ఎం ప్రదర్శన మేళా చక్కగా జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్ఎంలను పరిశీలించారు. పాఠశాలల్లో టీఎల్ఎం ఉపయోగించి బోధిస్తే ప్రయోజనం ఉంటుందని తెలిపారు. మండల స్థాయిలో టీఎల్ఎం మేళా జరిగిందని, త్వరలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఈ మేళా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ పీపీ రాథోడ్ మాట్లాడుతూ.. పటాన్‌చెరు, అమీన్‌పూర్ రెండు మండలాలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలలను 270 ఎగ్జిబిట్స్ రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు, అమీన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మెళకువలు పాటిస్తే మేలైన దిగుబడి

జహీరాబాద్: రైతులు ఆలుగడ్డ సాగులో మెళకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఏఈఓ ప్రదీప్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని రంజోల్ గ్రామంలో ఆలుగడ్డ పంటలను పరిశీలించారు. తగిన మోతాదులో ఎరువులను వేసుకోవాలని, బోదెలకు మట్టిని ఎగదోయాలని సూచించారు. లేనట్లయితే సూర్యరశ్మి పడి ఆలుగడ్డ పచ్చరంగులోకి మారి నష్టం వస్తుందన్నారు. చెలక నేలల్లో నాలుగు నుంచి ఐదు రోజులకు ఒక మారు నీటి తడులు అందించాలన్నారు. ఆకుమాడు తెగుళ్లతో నల్లని మచ్చలు ఏర్పడి మొక్కలు ఎండిపోతుందన్నారు. దీన్ని నివారించేందుకు రసాయన మందులను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు షఫీ, గుడ్డు, ఫిరోజ్, మహేశ్‌యాదవ్, ఏసప్ప, మక్బూల్ పాల్గొన్నారు.



ఆలుగడ్డ పంటను పరిశీలిస్తున్న ఏఈఓ

అన్ని మండలాలను సివిల్ కోర్టు పరిధిలోకి తేవాలి

నర్సాపూర్: జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలోకి నర్సాపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాలను తేవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజిరెడ్డి, సీనియర్ న్యాయవాది ఇక్బాల్ అలీ జాఫర్‌లు ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కోరారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను వారు కలిశారు. హత్నూర, గుమ్మడిదల, జిన్నారం మండలాలు సంగారెడ్డి జిల్లా పరిధిలోకి వెళ్లడంతో నర్సాపూర్ కోర్టు పరిధి నుంచి ఆయా మండలాలు తొలగించారన్నారు. దీంతో కోర్టు పరిధి చిన్నగా అయ్యిందని ఎమ్మెల్యేకు వివరించారు. నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని కొల్చారం, మాసాయిపేట, వెల్దుర్తి, హత్నూర మండలాలను నర్సాపూర్ కోర్టు పరిధిలోకి కలిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరగా, అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. తన వంతు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

'బీఆర్ఎస్‌లోనే ఉంటా..'

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: తాను పార్టీ మారుతున్నాననే ప్రచారంలో వాస్తవం లేదని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం స్పష్టం చేశారు. కంఠంలో ఊపిరి ఉన్నంతకాలం బీఆర్ఎస్‌లోనే ఉంటాననని తెలిపారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రగతిని వివరించేందుకు బుధవారం ఓ సంగారెడ్డిలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాలులో విలేకర్లతో మాట్లాడారు. సంగారెడ్డి అసెంబ్లీ స్థానానికి బీఆర్ఎస్ తరఫున అభ్యర్థిత్వానికి తన పేరును పరిశీలించాలని ఇప్పటికే మంత్రి హరీశ్‌రావుకు విజ్ఞప్తి చేశానన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ పార్టీ మారుతారని, బీజేపీలో చేరుతారనే ప్రచారం జరిగిందన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రగతిని వివరించిన మాణిక్యం డీసీసీబీ టర్నోవర్ రూ.రెండు వేల కోట్లకు చేరువైందన్నారు.

యాసంగికి 'తాలెల్మ' నుంచి నీటి విడుదల



లిఫ్ట్‌ను ఆన్ చేస్తున్న చైర్మన్ లింగాగౌడ్

జోగిపేట(అందోల్): ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆదేశానుసారం యాసంగి సాగుకు మూడు వేల ఎకరాలకు సంబంధించి తాలెల్మ శ్రీ రేణుక ఎల్లమ్మతల్లి ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేసినట్లు లిఫ్ట్ కమిటీ చైర్మన్ లింగాగౌడ్ అన్నారు. గురువారం మోటార్లను ప్రారంభించి లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిఫ్ట్ ద్వారా సాయిపేట, గడ్డిపెద్దాపూర్ ఫీడర్ ఛానల్ ద్వారా సాగుకు నీరందుతుందన్నారు. లిఫ్ట్ నుంచి 34 చెరువులను నింపుతామన్నారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో అందోల్ నియోజకవర్గం సస్యశ్యామలమవుతుందన్నారు. రైతుల కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శ్రీనాథ్, ఏఈ విజయసాగర్, సాయిపేట సర్పంచ్ మల్లేశం, రైతులు పాల్గొన్నారు.

టీఎల్ఎం మేళాతో గుణాత్మక మార్పు

రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్



బోధనోపకరణలను పరిశీలిస్తున్న చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): టీఎల్ఎం మేళాలు విద్యావ్యవస్థలో సృజనాత్మకతను వెలికి తీయడానికి ఎంతో దోహదపడతాయని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం సదాశివపేట పట్టణంలోని బసవ సేవా సదన్‌లో ఏర్పాటు చేసిన టీఎల్ఎం మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడానికే మన ఊరు – మన బడి, మన బస్తి – మన బడి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. ఉపాధ్యాయులు తయారు చేసిన సైన్స్, గణితం, ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ తదితర సబ్జెక్టులతో పాటు మిగతా సబ్జెక్టులకు సంబంధించిన 540 బోధన పద్ధతులను ప్రదర్శించారు. అనంతరం విజేతలైన ఉపాధ్యాయులను బహుమతులు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, ఎంపీపీ యాదమ్మ, జెడ్పీటీసీ శ్రీదేవి, ఎంపీడీఓ పూజ, ఎంఈఓ దండుల అంజయ్య, నోడల్ అధికారి రుద్రప్ప, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తుకారం, లింబజీ, ధనశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి అంతర్ జిల్లా పాలిటెక్నిక్ క్రీడలు

జహీరాబాద్ టౌన్: రంజోల్ శ్రీసంగమేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నుంచి రెండు రోజుల పాటు అంతర జిల్లా క్రీడల పోటీలు జరుగుతాయని ప్రిన్సిపల్ డి.కుమార స్వామి తెలిపారు. సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటారని చెప్పారు. 21 క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయని, 260 మంది బాలురు, 180 మంది బాలికలు ఆటల పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సాంకేతిక విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరక్టర్(ఆర్‌జేడీ) ఏ.పుల్లయ్య, మహీంద్ర కర్మాగారం అధికారి సుధాకర్ హాజరవుతాయన్నారు. ఈనెల 6వ తేదీన క్రీడల ముగింపు కార్యక్రమం ఉంటుందని, అదే రోజు విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని వివరించారు.

కల్లుగీత కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జంగన్నగౌడ్

సంగారెడ్డి టౌన్: కల్లుగీత కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జంగన్నగౌడ్ నియమితులైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి రమణ బుధవారం తెలిపారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న జంగన్నగౌడ్‌ని రాష్ట్ర మహాసభల సందర్భంగా సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రమేశ్ గౌడ్, సంగారెడ్డి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేట కమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు బుధవారం జరిమానా, జైలు శిక్ష విధించింది. సిద్దిపేటలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ చేపట్టిన వాహనాల తనిఖీల్లో 20 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన జడ్జి రమేశ్‌బాబు వారికి రూ.44,500 జరిమానా, ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

వ్యక్తి ఆత్మహత్య


ధాకయ్య (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): పాలివారితో పొలంగట్టు పంచాయతీ జరగడంతో మనస్తాపానికిగురైన వ్యక్తి పురుగుల మందు తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి, తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొట్టాల పరిధిలోని లింగంపలికి చెందిన బచ్చలి ధాకయ్య(50)కు పాలివారితో పొలం హద్దు విషయంలో గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం గొడవ జరగగా గ్రామ పెద్దల సమక్షంలో మాట్లాడుకున్నారు. ఈవిషయంలో మనస్తాపం చెంది అదేరోజు సాయంత్రం ధాకయ్య ఇంటి నుంచి పొలానికి వెళ్తున్నానని వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి కొడుకు కుంటయ్య పొలానికి వెళ్లి చూడగా పురుగుల మందు తాగి పడి వున్నాడు. చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. కుటుంబ సభ్యులు నర్సాపూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

పంట వ్యర్థాలతో బయోచార్

- రెండు పద్ధతుల్లో తయారీ
- బయోచార్ ద్వారా సుసంపన్నమైన నేలలు
- సేంద్రియ వ్యవసాయం దిశగా అడుగులు
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అరణ్య సంస్థ


పండ్లు, కూరగాయల మొక్కలు వేసిన బయోచార్ ఎరువు

ఝరాసంగం(జహీరాబాద్): రోజురోజుకి వ్యవసాయ సాగులో రసాయనాల వాడకం విపరీతంగా పెరుగుతోంది. దీంతో పర్యావరణ కాలుష్యమే కాకుండా నేల నాణ్యత క్షీణించిపోవటం, పంటల ఉత్పత్తి తగ్గిపోవటం వంటివి సంభవిస్తాయి. భూమి నుండి వచ్చిన వృథాగా కానివ్వకుండా భూమిలోకి వెళ్లాలన్నదే లక్ష్యం. ఈ క్రమంలో పంటల సాగు అనంతరం మిగిలిన వ్యర్థాలతో బయోచార్‌ను తయారు చేసి, సేంద్రియ వ్యవసాయం దిశగా అడుగులు వేస్తున్నారు. మండల పరిధిలోని బిడెకన్నె గ్రామ శివారులో పర్మాకల్చర్‌లో భాగంగా అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థ ద్వారా సీఈఓ కొప్పుల పద్మ, డైరెక్టర్ కొప్పుల నర్సన్నలు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. 11.5 ఎకరాల విస్తీర్ణంలో సాగుచేస్తూ పరిసర ప్రాంతంలో సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులకు కల్పిస్తున్నారు. సేంద్రియ పద్ధతులతో సాగుచేసే విధానాలు, ప్రయోజనాలను స్థానిక రైతులకు వివరిస్తున్నారు.

అరణ్య వ్యవసాయ సంస్థలో తయారీ

- రైతులు సాగు చేసిన పంటల రాశుల అనంతరం మిగిలిన వ్యర్థాలు (మొక్క, ఆకులు తదితరాలు)తో బయోచార్‌ను తయారు చేస్తున్నారు. వ్యర్థ పదార్థాల నుండి పైరోలిసిస్ పద్ధతిలో చేయబడిన బొగ్గును బయోచార్‌గా పిలుస్తున్నారు.
- అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థలో రెండు పద్ధతుల్లో బయోచార్‌ను తయారు చేస్తున్నారు. గుంట పద్ధతి, రింగ్ ఆఫ్ ఫైర్ పద్ధతుల్లో బయోచార్‌ను తయారు చేస్తున్నారు.
- పత్తి, సోయా తదితర పంటలు గుట్టగా చేసిన తర్వాత వచ్చే కట్టెలు, ఆకులను వేరువేరుగా తీసుకువచ్చి కాల్చి బూడిద కానివ్వకుండా బొగ్గు రూపంలోకి రాగానే దానిని తీసి, విసర్జన ఎరువు, జీవామృతముతో కలిపి తయారు చేస్తున్నారు.
- 10 కిలోల వ్యర్థాలను బయోచార్ చేస్తే 5 కేజీల నుంచి 6 కేజీల వరకు వస్తుంది. అనంతరం 100 కేజీల విసర్జన ఎరువుకు 10 కేజీల బయోచార్‌ను కలిపి భూమిలో వేసుకోవచ్చని వివరించారు.
- భూమిలో ఇప్పటి వరకు ఉన్న రసాయనాలను పీల్చేసి మంచి వాతావరణంతో పాటు సుసంపన్నమైన నేలల తయారీకి అనువుగా ఉంటుందంటున్నారు. ఒకసారి పొలంలో బయోచార్ ఎరువు వేస్తే వందల సంత్సరాల వరకు దాని ప్రభావం ఉంటుందంటున్నారు. ఫలితంగా పంట అధిక దిగుబడులు లభించటమే కాకుండా ఆరోగ్య ఆహారం పంటలు పండించవచ్చు.
- సాధారణంలో పంటల వ్యర్థాలను విచ్చలవిడిగా కాల్చేయటం, బూడిద చేయటం ద్వారా పొగను గాల్లోకి వదిలేయటం ద్వారా వాతావరణ కాలుష్యంతో పాటు వ్యర్థాలు వృథా అవుతాయని నిపుణులు చెబుతున్నారు.

బయోచార్ వ్యాప్తికి ప్రణాళికలు

అరణ్య సంస్థలో తయారు చేస్తున్న బయోచార్ ఎరువు తయారీ పెంచేందుకు గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అందులో భాగంగా ముందుగా మండలంలో గ్రామానికి ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి వారి నుండి సేకరించి, బయోచార్‌ను తయారు చేసి తిరిగి రైతులకు సాయిల్ ఆర్గానిక్ కార్బన్‌గా వినియోగించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

అరణ్య సంస్థ ద్వారా గ్రామాల్లోని రైతులకు బయోచార్ తయారీతో పాటు వినియోగంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తాం. రైతులు తమ పంట వ్యర్థాలను వృథా చేయొద్దు. భూమిలో నుండి వచ్చిన దానిని భూమిలోకి తీసుకెళ్లాలి. సేంద్రియ వ్యవసాయాన్ని విస్తీర్ణం పెంపొందిస్తాం.

– కొప్పుల పద్మ, సీఈఓ, అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థ, బిడెకన్నె

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న చింతాప్రభాకర్ తదితరులు

రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతాప్రభాకర్

కంది(సంగారెడ్డి): రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కందిలో షాదీముబారక్, కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆడపిల్ల పెండ్లి తల్లిదండ్రులకు భారం కాకూడదని తెలంగాణ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. గతప్రభుత్వాల మాదిరిగా కాకుండా పార్టీలకతీతంగా పథకాలు అందరికీ అందుతున్నాయన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని బీజేపీ నాయకులు మతవిద్వేషాలను రెచ్చగొట్టి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో వారిఆటలు సాగవన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. అంతకుముందు కంది పల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన వీధి లైట్లను ప్రారంభించారు. కందిలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సరళ పుల్లారెడ్డి, జెడ్పీటీసీ కొండల్ రెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ విశ్వప్రసాద్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు మధుసూదన్‌రెడ్డి, నరహరిరెడ్డి, చిల్వేరి ప్రభాకర్, కృష్ణగౌడ్, మోహన్ రెడ్డి, రాంరెడ్డి, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పట్టు పురుగుల పెంపకంపై అవగాహన


పట్టు పురుగుల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని ఖమ్మంపల్లి ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులకు వ్యవసాయ పనుల వివరాలు, పట్టు పురుగుల పెంపకం, జీవిత చరిత్రపై అవగాహన కల్పించారు. గ్రామంలోని పట్టు పురుగుల తోటలను, పట్టు గూళ్ల పెంపకం, పట్టు పురుగు జీవిత చరిత్రలో భాగంగా ప్రయోగ శాలలో 15 రోజులుగా పట్టు పురుగుల పెంపకంలో మారుతున్న జీవన విధాన తీరులపై విద్యార్థులకు ప్రాక్టికల్‌గా వివరించారు. 15 రోజుల్లో పట్టు పురుగులు ప్యూపాదశలోకి మారిన విధానాన్ని చూపించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులు పాల్గొన్నారు.

సమోసాలో చిట్టెలుక

- హోటల్ నిర్వాహకుడిపై ఆగ్రహం
- క్షమాపణతో శాంతించిన వినియోగదారులు



సిద్దిపేటరూరల్: ఓ హోటల్‌లో కొన్న సమోసాలో చనిపోయిన చిట్టెలుక బయటపడ్డ ఘటన రాఘవాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అధికం వెంకటస్వామి హోటల్‌లో సమోసాలు కొన్నాడు. తింటున్న క్రమంలో చనిపోయిన ఎలుక వచ్చింది. దీంతో వినియోగదారుడు హోటల్ నిర్వాహకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న మరికొంతమంది గొడవకు దిగడంతో నిర్వాహకుడు మళ్లీ ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చూసుకుంటానని చెప్పడంతో గొడవ సద్దుమనిగింది. అప్పటికే 130 సమోసాలు అమ్మినట్లు నిర్వాహకుడు తెలిపారు.

వేద పండితుడు వాసుదేవ శర్మ మృతి


వాసుదేవ శర్మ (ఫైల్)

ప్రశాంత్ నగర్(సిద్దిపేట): సిద్దిపేట వేద పండితుడు, యాజ్ఞికుడు అప్పాల వాసుదేవ శర్మ(80) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో జిల్లా కేంద్రంలో మరణించారు. మర్కుక్ మండల కేంద్రానికి చెందిన వాసుదేవ శర్మ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. శాస్త్రాలు, పురాణాలు అధ్యయనం చేసి వాటిలో ప్రావీణ్యం సంపాదించారు. పలు సంస్కృత గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీలో ఆయన ఇంట్లో చండీయాగం నిర్వహించారు. సిద్దిపేటలో 25 ఏళ్ల క్రితం ప్రారంభమైన శ్రీ సదానంద భారతీ తీర్థ వైదిక పాఠశాల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. వాసుదేవ శర్మ మృతికి మంత్రి హరీశ్‌రావు తదితరులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

ఉచిత శిక్షణ

సిద్దిపేట రూరల్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఎస్సై, కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షల కోసం ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు బీసీ సంక్షేమ శాఖ అధికారి సరోజ బుధవారం తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 7వ తేదీలోగా బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు అందచేయాలని సూచించారు. పోలీస్ ఈవెంట్స్ ఉత్తీర్ణత సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ జిరాక్స్, రెండు ఫొటోలు దరఖాస్తుతో జతచేసి ఇవ్వాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9966673095 నంబర్‌లో లేదా బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వివాహిత

కాపాడిన యువకుడు

జిన్నారం(పటాన్‌చెరు): కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది కుంటలోకి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ఓ వివాహిత యత్నించింది. అప్రమత్తమైన స్థానిక యువజన సంఘం నాయకుడు అడ్డుకున్నాడు. బుధవారం బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఓ కాలనీలో నివాసం ఉంటున్న వివాహిత కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకునేందుకు మాధవాని కుంటకు చేరుకుంది. గమనించిన ఆనంద్ కృష్ణారెడ్డి ఆమె వద్దకు వెళ్లి మాట్లాడి విషయం తెలుసుకుని సర్దిచెప్పాడు. అనంతరం తన వాహనంలో ఇంటి వద్దకు వదిలి వెళ్లాడు. వివాహితను కాపాడినందుకు కృష్ణారెడ్డిని పలువురు అభినందించారు.

రైలు ఢీ: వ్యక్తికి గాయాలు


గాయపడిన రాజు

చేగుంట(తూప్రాన్): మద్యం తాగి పట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన మాసాయిపేటలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిన్నశంకరంపేట మండలం దరిపల్లి గ్రామానికి చెందిన రాజు మద్యం తాగి మాసాయిపేట శివారులో పట్టాలు దాటుతున్నాడు. ఈక్రమంలో నిజామాబాద్ వెళ్తున్న రైలు ఢీకొనడంతో కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కామారెడ్డి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు కామారెడ్డి రైల్వే ఎస్ఐ తావూనాయక్ తెలిపారు.

పోలీసులకు ఆరోగ్య రక్ష

- మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో పోలీస్ హెల్త్ ప్రొఫైల్
- పైలెట్ ప్రాజెక్టుగా సిద్దిపేట జిల్లా
- నేడు ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు


ఎత్తును పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, ఆర్ఐ రాజశేఖర్‌రెడ్డి (ఫైల్)

సిద్దిపేట కమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలోని అధికారులు, సిబ్బందికి సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్యులచే ఉచిత ఆరోగ్య సూచనలు, సలహాలు, చికిత్సపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చొరవతో జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందికి రెండేళ్ల పాటు వారి ఆరోగ్య పరిరక్షణ గురించి పైలెట్ ప్రాజెక్టుగా సిద్దిపేటను ఎంపిక చేయడం జరిగింది. సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత సూచనల మేరకు అధికారులు, సిబ్బందికి మొదటి విడతగా పరీక్షలు నిర్వహించారు. విడతలవారీగా అందరికీ ఆరోగ్య పరిరక్షణ గురించి అవగాహన సదస్సులు, చికిత్సలు నిర్వహించడం జరుగుతుందని పోలీసు అధికారులు తెలిపారు.

నేడు ప్రారంభించనున్న మంత్రి

సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు హెల్త్ ప్రొఫైల్ క్యాంప్‌ను నేడు రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. ఇటీవల పోలీస్ కన్వెన్షన్ సెంటర్లో పోలీస్ అధికారులకు మెడికల్ కళాశాల వైద్యులు అవగాహన కల్పించారు. విడతలవారీగా జిల్లాలోని హోంగార్డు నుంచి ఉన్నతాధికారి వరకు చికిత్స చేయనున్నారు. రెండు సంవత్సరాల పాటు వారి ఆరోగ్యం డాక్టర్ల పర్యవేక్షణ చేయనున్నారు. మంత్రి సహాయ సహకారాలతో సిద్దిపేట జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పోలీసు అధికారులు, సిబ్బంది సద్వినియోగం చేసుకునెలా విడతల వారీగా రక్త, మూత్ర పరీక్షలు, బిపి, షుగర్, గుండెనొప్పి, ఒత్తిడికి లోనవ్వడం తదితర అంశాలపై వైద్యులు అవగహన కల్పించనున్నారు.

మహిళల రక్షణకే స్నేహిత కేంద్రం

- సిద్దిపేట వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో స్నేహిత మహిళ సహాయ కేంద్రం
- నేడు ప్రారంభించనున్న రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేటలో ప్రారంభించనున్న స్నేహిత కేంద్రం

సిద్దిపేటకమాన్: రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ మహిళల రక్షణ కొరకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. సిద్దిపేటలో ఇప్పటికే షీ టీమ్స్, మహిళ పోలీసు స్టేషన్, భరోసా సెంటర్, సఖి సెంటర్ ఇలా అనేక కార్యక్రమాలు చేపట్టి కొనసాగిస్తున్నారు. నూతనంగా సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలోని వన్ టౌన్ పోలీసుస్టేషన్‌లో స్నేహిత కేంద్రం ఏర్పాటు కానుంది. రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో సిద్దిపేట వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో స్నేహిత కేంద్రం ప్రారంభం కానుంది. స్నేహిత మహిళలకు సహాయక కేంద్రాన్ని గురువారం మంత్రి ప్రారంభించనున్నారు.

మహిళా రక్షణలో స్నేహిత

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా స్త్రీలు, బాలికలు ఎదుర్కొంటున్న వివిధ రకాల (లైంగిక, మానసిక, శారీరక, రాజకీయ) హింసల నుంచి రక్షణ కల్పించడానికి అనేక సహాయ సంస్థలను ఏర్పాటు చేశాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇంతకుముందు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సఖి సెంటర్లను ఏర్పాటు చేసింది. స్త్రీల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న కొన్ని స్వచ్ఛంద సంస్థలను ఎంపిక చేసి స్వార్డు స్వచ్ఛంద సంస్థకు నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. మహిళలు స్వార్డ్ (స్నేహిత) సెంటర్‌లో తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చు

ఆడపడుచులకు ఆత్మీయ భరోసా



మహిళా రక్షణతో పాటు ఫ్రెండ్లీ పోలీస్ ప్రభుత్వం అనటానికి నిదర్శనం. సిద్దిపేటలో గురువారం స్నేహిత సెంటర్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక మహిళల రక్షణ కోసం అనేక కార్యక్రమాలు చెప్పట్టడం జరిగింది. సిద్దిపేటలో ఇప్పటికే మహిళ పోలీస్ స్టేషన్, సఖి సెంటర్, భరోసా కేంద్రం ఇలా అనేక కార్యక్రమాలు చేపట్టాం. స్నేహిత ద్వారా మహిళకు అనేక ప్రయోజనాలు పొందేలా ఏర్పాటు చేయడం అభినందనీయం.

– మంత్రి హరీశ్‌రావు

రెడ్ల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర రెడ్డి జేఏసీ అధ్యక్షుడు రాంరెడ్డి

సిద్దిపేటకమాన్: రాష్ట్రంలోని రెడ్డి కుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర రెడ్డి జేఏసీ అధ్యక్షుడు రాంరెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌యస్ ప్రభుత్వం రెడ్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రెడ్డి కులంలో నిరుపేదలు ఉన్నారని, ఆర్థికంగా వెనుకబాటుతో వారి పిల్లలు ఉన్నత చదువులకు దూరమ వుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టుతున్న సంక్షేమ పథకాలను రెడ్లలకు వర్తింప చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు రామలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, జిల్లా మహిళ విభాగాం అధ్యక్షురాలు శశికళ రెడ్డి, వెంకటరెడ్డి, తిరుపతి రెడ్డి, పద్మ, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తి అరెస్ట్

మనోహరాబాద్(తూప్రాన్): ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తూప్రాన్ సీఐ శ్రీధర్ తెలిపారు. బుధవారం వివరాలు తెలిపారు. ధర్మరాజుపల్లి గ్రామంలో తేజస్వినిని యశ్వంత్‌రెడ్డి ప్రేమించి పెళ్లి చేసుకొని వదిలేసాడు. దీంతో మనస్తాపం చెందిన యువతి పురుగుల మందు తాగింది. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. కాగా యువతి మృతికి కారణమైన యశ్వంత్‌రెడ్డిని బుధవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

జెడ్పీటీసీ మల్లేశం కుటుంబానికి అండగా ఉంటాం

- సంతాప సభలో జెడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి
- ఆర్థిక సహాయం ప్రకటనతో కార్యకర్తలకు భరోసా


జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ


మౌనం పాటిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ తదితరులు

చేర్యాల(సిద్దిపేట): ఇటీవల దారుణ హత్యకుగురైన చేర్యాల జెడ్పీటీసీ శెట్టె మల్లేశం కుటుంబానికి అండగా ఉంటామని, మల్లేశంను చంపిన నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని జెడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ అన్నారు. బుధవారం స్థానిక కల్యాణి గార్డెన్‌లో జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అధ్యక్షతన జెడ్పీటీసీ శెట్టె మల్లేశం సంతాప సభ ఏర్పాటుచేశారు. జెడ్పీటీసీ కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్ మల్లేశం చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. 2 నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తన తోటి జెడ్పీటీసీ సభ్యుడి సంతాప సభలో పాల్గొనడం బాధాకరంగా ఉందన్నారు. మల్లేశం తనకు తమ్ముడి వంటి వాడని, సౌమ్యుడు మల్లేశంను దారుణంగా హత్యచేసిన దుండగులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారుల కోరారు. ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి మాట్లాడుతూ జెడ్పీటీసీ మల్లేశం మృతి బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటన్నారు. పార్టీకి నిబద్ధతతో పనిచేసిన ఆయన మరణాన్ని జీర్ణించుకోలేక పోతున్నానన్నారు. పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. హత్యకు కారణమైన వారిని ఉపేక్షించేది లేదని, వారిని కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జనగామ నియోజకవర్గం పరిధిలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మల్లేశంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

రూ.16లక్షల ఆర్థిక సహాయం

జెడ్పీటీసీ కుటుంబానికి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి రూ.5లక్షలు, జిల్లా జెడ్పీటీసీల తరుపున జెడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ రూ.2.10 లక్షలు, బీఆర్‌ఎస్ పార్టీ జనగామ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గుజ్జ సంపత్‌రెడ్డి రూ.లక్ష, మద్దూరు ఎంపీపీ బద్దిపడిగ కృష్ణారెడ్డి రూ.లక్ష, నియోజకవర్గ పరిధిలోని పలువురు ప్రజా ప్రతినిదులు, నాయకులు కలిపి రూ.7 లక్షలతో కలిపి మొత్తం రూ.16.10 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు సంతాప సభలో ప్రకటించారు. ఈ మొత్తాన్ని మల్లేశం ఇద్దరు కూతుర్ల పేరిట బ్యాంకులో డిపాజిట్ చేసి పత్రాలు అందించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్యకు బాధ్యత అప్పగించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గుజ్జ సంపత్‌రెడ్డి, ఎంపీపీలు కరుణాకర్, కీర్తన, జెడ్పీటీసీ సిద్దప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్లు స్వరూపరాణి, జమున, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, మల్లన్న ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశం, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం, యాదగిరి, సంతోష్, నాయకులు బాల్‌నర్సయ్య, ఏకానందం, అంజయ్య, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.